## జనరల్ స్టోర్‌ను ప్రారంభించిన మాజీ ఎమ్మెల్యే


పూజలో చేస్తున్న మాజీ ఎమ్మెల్యే పద్మాదేవేందర్‌రెడ్డి

మెదక్, మార్చి 15 (నమస్తే తెలంగాణ): మెదక్‌లో యాచం గుండయ్య లక్ష్మణ్ భవనంలో ఏర్పాటు చేసిన స్వప్న జనరల్ అండ్ ఫ్యాన్సీ స్టోర్‌ను బీఆర్‌ఎస్ మెదక్ జిల్లా అధ్యక్షురాలు, మాజీ ఎమ్మెల్యే పద్మా దేవేందర్‌రెడ్డి శనివారం ప్రారంభించారు. ఆమె వెంట మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్లు బట్టి జగపతి, కృష్ణారెడ్డి, మున్సిపల్ మాజీ కౌన్సిలర్ శ్రీనివాస్, నాయకులు పాల్గొన్నారు.

## 22న డిగ్రీ కళాశాలలో రాష్ట్రస్థాయి మేళా

మెదక్ మున్సిపాలిటీ, మార్చి 15: ఈనెల 22న మెదక్ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో వృక్షశాస్త్ర విభాగం ఆధ్వర్యంలో హెర్బేరియం తయారీ, నిల్వ చేయు విధానం అంశంపై ఒక రోజు రాష్ట్రస్థాయి మేళాను రాష్ట్రీయ ఉచిత ఉచితార్ శిక్షాభియాన్ వారి ఆర్థిక సహకారంతో నిర్వహిస్తున్నట్లు ప్రిన్సిపాల్ హుస్సేన్ తెలిపారు. శనివారం దీనికి సంబంధించి కరపత్రాలను ఆవిష్కరించారు. పాల్గొన దల్చిన ఉపన్యాసకులు, విద్యార్థులు ఈనెల 20వ తేదీలోపు ఆన్‌లైన్ లింక్ ద్వారా గానీ, లేదా కళాశాలలో పేరు నమోదు చేసుకోవాలని సూచించారు. వివరాలకు 9948554989, 9912797070 నంబర్లను సంప్రదించాలన్నారు.

## అనుమానాస్పద స్థితిలో యువకుడి మృతి

మెదక్ అర్బన్, మార్చి 15: అనుమానాస్పద స్థితిలో చెట్టుకు ఉరేసుకుని ఓ యువకుడు మృతి చెందిన ఘటన జిల్లా కేంద్రంలో జరిగింది. పోలీసులు, కుటుంబీకులు తెలిపిన వివరాల ప్రకారం...మెదక్‌లోని బారిమామ్ కాలనీకి చెందిన అమ్లిపూర్ అరవింద్ (24) కొద్ది నెలలుగా తల్లి ఆరోగ్యం బాగాగలేక అప్పు చేశాడు. అప్పు తీర్చలేక మనస్తాపానికి గురై తరుచూ బాధపడేవాడు. ఈ నెల 14 రాత్రి 11 గంటల వరకు ఎదురు చూసినా ఇంటికి తిరిగి రాలేదని నేడు ఉదయం 6 గంటలకు ఇంటి పక్కన గల కటికే గంగారం పాడుబడిన ఇంటి ముందు వేప చెట్టుకు చున్నితో ఉరేసుకుని మృతిచెందాడు. వెంటనే చున్నీని కత్తిరించి కిందికి దించి చుడగా తలపై చిన్న రక్తగాయం అయి ఉందని తన కొడుకు మృతికి కారణం విచారించి చట్టరీత్యా తగు చర్య తీసుకోవాలని ఫిర్యాదు చేయగా కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు పట్టణ సీఐ తెలిపారు.

## పరిసరాలు శుభ్రంగా ఉండాలి

### పాల్యుషన్ కంట్రోల్ బోర్డు స్టేట్ విజిలెన్సు అధికారి రవీందర్


ఎక్స్‌రే, రోగుల గదులను పరిశీలిస్తున్న రాష్ట్ర అధికారి

రామాయంపేట, మార్చి 15: ప్రభుత్వ దవాఖానలో రోగులకు ఎలాంటి ఇబ్బందులు కలుగకుండా, పరిసర ప్రాంతాలు శుభ్రంగా ఉండేలా సిబ్బంది చూసుకోవాలని రాష్ట్ర పొల్యూషన్ కంట్రోల్ బోర్డు విజిలెన్సు అధికారి రవీందర్ సూచించారు. శనివారం రామాయంపేట సీహెచ్‌సీని సందర్శించి దవాఖాన పరిసర ప్రాంతాల్లోని బయో మెడికల్ గార్డెన్, ఎక్స్‌రే, మందులు, ల్యాబ్‌లను పరిశీలించారు. దవాఖాన ఎదురుగా బయోమెట్రిక్ గార్డెన్‌లో వివిధ రకాల ఆయుర్వేదిక్ చెట్లు పెంచడం బాగుందన్నారు. ఆయన వెంట తూప్రాన్ సీహెచ్‌సీ వైద్యుడు అమర్‌సింగ్, రామాయంపేట సీహెచ్‌సీ వైద్యులు లింబాద్రి, సిబ్బంది ఉన్నారు.

## నీటి యాజమాన్య పద్ధతులపై అవగాహన

రామాయంపేట, మార్చి 15: పంటలకు నీటి యాజమాన్య పద్ధతుల ద్వారా అందించాలని ఇన్‌చార్జి ఏవో రాజ్‌నారాయణ తెలిపారు. శనివారం పట్టణ శివారులోని గొల్పర్తి, కోమటిపల్లి గ్రామాల్లో పంటలు పరిశీలించారు. వరి వేసుకున్న రైతులు ఎండలు ఎక్కువగా ఉన్నందున వరుస తడులను పెట్టాలన్నారు. వరి పంటలో సుమారు 5 ఇంచుల నీళ్లు ఉంటే సరిపోతుందన్నారు. మండల వ్యాప్తంగా 13339 ఎకరాల్లో యాసంగిలో రైతులు వరి పంట వేశారన్నారు. కార్యక్రమంలో ఏఈవో ప్రవీణ్, రైతులు ఉన్నారు.

## దివ్యాంగులు అన్ని రంగాల్లో రాణించాలి


వీల్‌చైర్స్ పంపిణీ చేస్తున్న సీనియర్ సివిల్ జడ్జి జితేందర్

మెదక్ మున్సిపాలిటీ, మార్చి 15: దివ్యాంగులు అన్ని రంగాల్లో ఆత్మస్థైర్యంతో ముందుకు సాగాలని మెదక్ సివిల్ జడ్జి జితేందర్ అన్నారు. శనివారం జిల్లా కేంద్రంలోని భవితా కేంద్రంలో సమగ్ర శిక్ష ఆధ్వర్యంలో జిల్లాలోని ఆయా మండలాలల దివ్యాంగ విద్యార్థులకు డీఈవో రాధాకిషన్, సమ్మిళిత విద్యా సెక్టోరియల్ అధికారి సతీశ్‌కుమార్‌తో కలిసి వీల్‌చైర్స్, వినికిడి యంత్రాలు ఉచిత సహాయ ఉపకరణాలు పంపిణీచేశారు. దివ్యాంగులు ప్రభుత్వం అందజేస్తున్న సంక్షేమ పథకాలను సద్వినియోగం చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో ఎంఈవో నీలకంఠం, ఉపాధ్యాయులు, దివ్యాంగుల తల్లి దండ్రులు పాల్గొన్నారు.

## మద్యానికి బానిసై వ్యక్తి ఆత్మహత్య


నీరడి జైపాల్ (ఫైల్)

నర్సాపూర్, మార్చి 15: మద్యానికి బానిసైన ఓ వ్యక్తి గడ్డిమందు తాగి ఆత్మహత్య చేసుకున్న ఘటన నర్సాపూర్ పోలీస్‌స్టేషన్ పరిధిలోని మహమ్మదాబాద్‌లో జరిగింది. ఎస్సై లింగం కథనం ప్రకారం.. నీరడి జైపాల్(35) మేస్త్రీ పని చేస్తూ జీవిస్తున్నాడు. రెండేండ్ల నుంచి మద్యానికి బానిసై పని చేయకుండా ఖాళీగా ఊరిలో తిరుగుతున్నాడు. ఊభార్యతో తరుచూ గొడవపడుతూ, డబ్బులు ఇవ్వకపోతే చనిపోతానని పలుమార్లు బెదించేవాడు. గతంలో జైపాల్ ఉరేసుకుంటానని, ఇంట్లో గ్యాస్ లీక్ చేసి చనిపోతానని బెదిరించడంతో గ్రామపెద్దలు నచ్చజెప్పారు. శుక్రవారం జైపాల్ బాగా మద్యం తాగి స్నానం చేసిన తర్వాత బయటికి వెళ్లి శ్మశానంలో గుర్తు తెలియని గడ్డిమందు తాగి ఇంటికి వచ్చి వాంతులు చేసుకున్నాడు. ఇదేంటని కుటుంబ సభ్యులు అడగగా గడ్డిమందు తాగానని తెలపడంతో నర్సాపూర్ ఏరియా ప్రభుత్వ దవాఖానకు, మెరుగైన చికిత్స కోసం గాంధీ దవాఖానకు తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ శనివారం ఉదయం మృతిచెందాడు. మృతుడికి భార్య, ఇద్దరు కూతుళ్లు ఉన్నారు. మృతుడి భార్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

# మెరుగైన వైద్య సేవలు అందించాలి

- రోజూ వారి మెనూ పక్కాగా అమలు చేయాలి
- గురుకులాలు, వసతి గృహాల్లో పరిశుభ్రత చర్యలు చేపట్టాలి
- కలెక్టర్ రాహుల్‌రాజ్
- జిల్లా కేంద్రంలోని గిరిజన మినీ గురుకుల పాఠశాలను తనిఖీ చేసిన కలెక్టర్


మెదక్ మున్సిపాలిటీ: వంట సరుకులను పరిశీలిస్తున్న కలెక్టర్ రాహుల్ రాజ్


వెల్దుర్తి: రోగులతో మాట్లాడుతున్న కలెక్టర్

వెల్దుర్తి, మార్చి 15: వైద్యం కోసం ప్రభుత్వ దవాఖానలకు వచ్చే రోగులకు మెరుగైన వైద్య సేవలు అందించాలని కలెక్టర్ రాహుల్‌రాజ్ అన్నారు. శనివారం వెల్దుర్తి ప్రభుత్వ దవాఖానను కలెక్టర్ తనిఖీ చేశారు. శనివారం కలెక్టర్ దవాఖానకు వచ్చి రోగులతో మాట్లాడి, అందుతున్న వైద్య సేవలు, ఇస్తున్న మందులు, దవాఖాన సిబ్బంది పనితీరును అడిగి తెలుసుకున్నారు. కలెక్టర్ మాట్లాడుతూ రోగుల పట్ల నిర్లక్ష్యం వహించరాదన్నారు. డాక్టర్లతో పాటు సిబ్బంది సమయపాలన పాటించాలని, విధుల్లో నిర్లక్ష్యం వహిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. కలెక్టర్ వెంట తహసీల్దార్ కృష్ణ, ఆర్ఐ నర్సింగ్‌యాదవ్, దవాఖాన సిబ్బంది ఉన్నారు.

### మెదక్ గురుకులంలో తనిఖీ

మెదక్ మున్సిపాలిటీ, మార్చి 15: గురుకులాల్లో రోజూ వారి మెనూ పక్కాగా అమలు చేయాలని కలెక్టర్ రాహుల్ రాజ్ అధికారులను ఆదేశించారు. శనివారం జిల్లా కేంద్రంలోని గిరిజన మినీ గురుకుల పాఠశాలను కలెక్టర్ రాహుల్ రాజ్ తనిఖీ చేశారు. పాఠశాలలోని వంట గదితో పాటు వంట సరుకులు నిల్వ చేసే గదిని తనిఖీ చేసి పప్పులు, వంట నూనె, బియ్యం, కూరగాయలు, ఆకు కూరలు పరిశీలించారు. తరగతి గదులను తనిఖీ చేసి నిత్యం పరిశుభ్రత చర్యలు చేపట్టాలని ఆదేశించారు. తరగతి గదులలో చిన్నారులతో మమేకమై వారిలోని ప్రతిభను పరీక్షించి, పలు సూచనలు చేశారు. చక్కగా చదువుకోని ఉన్నత విలువలతో తమ లక్ష్యాలను సాధించాలని సూచించారు.

# విద్యార్థులు భవిష్యత్తు లక్ష్యాలు నిర్దేశించుకోవాలి


నార్సింగి మండలం శేరిపల్లి పాఠశాలలో విద్యార్థులతో కలిసి క్లాస్‌లు వింటున్న మాట్లాడుతున్న డీఈవో


నిజాంపేట: నస్కల్ ప్రాథమిక పాఠశాలలో ఏఐ బోధన తరగతులను ప్రారంభిస్తున్న హెచ్.ఎం.సాగరిక


శివ్వంపేట: ఏఐ ఆధారిత అభ్యాసనను ప్రారంభిస్తున్న ఎంఈవో బుచ్యానాయక్

చేగుంట, మార్చి 15: విద్యార్థులు భవిష్యత్తు లక్ష్యాలు నిర్దేశించుకోవాలని డీఈవో రాధాకిషన్ అన్నారు. చేగుంటలోని బాలికల ప్రాథమిక, జడ్పీహెచ్‌ఎస్, నార్సింగి మండలంలోని శేరిపల్లి ప్రాథమిక పాఠశాలలో ఆర్టిఫిషియల్ ఇంటలిజెన్స్ కార్యక్రమాన్ని శనివారం ప్రారంభించారు. కంప్యూటర్ ల్యాబ్, తరగతి గదులు, మధ్యాహ్న భోజనాన్ని పరిశీలించారు. పదో తరగతి విద్యార్థులను ఉద్దేశించి పలు సూచనలు చేశారు. చదువుపై శ్రద్ధ వహించాలని, ప్రత్యేక సమయ పాలనతో చదువుకోవాలని, సబ్జెక్టులో సందేహాలుంటే నివృత్తి చేసుకోవాలని సూచించారు. పాఠశాలలో తెలుగు, ఇంగ్లిష్, గణితంలో వెనుకబడిన విద్యార్థులను మెరుగుపరచడానికి రూపొందించిన కార్యక్రమంలో 15 పాఠశాలలను ఎంపిక చేయగా, శేరిపల్లి పాఠశాలలో కార్యక్రమాన్ని విద్యార్థులతో కలిసి తిలకించారు. కార్యక్రమంలో ఏఎంఓ సుదర్శన మూర్తి, హెచ్‌ఎం రఘుపతి, కాంప్లెక్స్ హెచ్‌ఎం తిరుపతి, వీరేందర్ పాల్గొన్నారు.

### పాఠశాలల్లో ఏఐ బోధన తరగతులు ప్రారంభం

నిజాంపేట, మార్చి 15: నస్కల్ ప్రాథమిక పాఠశాలలో ఏ.ఐ బోధన తరగతులను హెచ్‌ఎం సాగరిక ప్రారంభించారు. చదువులో వెనుకబడిన విద్యార్థులలో అభ్యసన సామర్థ్యాల పెంపునకు ఏ.ఐ టెక్నాలజీ ఉపయోగపడుతుందన్నారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు శ్రీనివాస్, ఎల్లం, మన్మథ, జాకీయా, రాజశేఖర్, రాజయ్య తదితరులున్నారు.

### శివ్వంపేటలో..

శివ్వంపేట, మార్చి 15: మండలంలోని చిన్నగొట్టిముక్ల, చండి గ్రామాల్లోని ప్రభుత్వ పాఠశాలల్లో ఏఐ ఆధారిత అభ్యాసన కార్యక్రమాన్ని ఎంఈవో బుచ్యానాయక్ ప్రారంభించారు. ఏఐ పిల్లలకు కంప్యూటర్ కృత్యాల ద్వారా ఎఫ్‌ఎల్‌ఎన్ పాఠాలు నేర్పిస్తారన్నారు. ఏఐ ఆధారిత అభ్యాసనను సద్వినియోగం చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో హెచ్‌ఎం ఇందుమతి, సురేందర్, పుష్ప, సురేశ్ పాల్గొన్నారు.

## నాటు తుపాకులతో తిరుగుతున్న వ్యక్తులు అరెస్ట్



వివరాలు వెల్లడిస్తున్న ఫారెస్ట్ రేంజ్ ఆఫీసర్ అరవింద్

నర్సాపూర్, మార్చి 15: వన్యప్రాణాలను హతమార్చేందుకు నాటు తుపాకులతో తిరుగుతున్న 8 మంది వ్యక్తులను అటవీ శాఖ అధికారులు అదుపులోకి తీసుకున్న ఘటన నర్సాపూర్‌లో శనివారం చోటుచేసుకుంది. ఎఫ్‌ఆర్‌వో అరవింద్ తెలిపిన వివరాల ప్రకారం.. నర్సాపూర్ మండలం నత్నాయిపల్లి గ్రామ శివారులోని అటవీ ప్రాంతంలో వన్యప్రాణులను వేటాడేందుకు నాటు తుపాకులతో తిరుగుతున్న బొంతపల్లి, షేర్‌ఖాన్‌పల్లి, నత్నాయిపల్లి, హత్నూరా గ్రామాలకు చెందిన 8 మంది ముఠా సభ్యులను శనివారం అదుపులోకి తీసుకున్నారు. వారి వద్ద నుంచి మూడు నాటు తుపాకులు, ఒక కత్తి, గన్‌పౌడర్‌ను స్వాధీనం చేసుకున్నారు. ముఠా సభ్యులపైన టీఎస్ ఫారెస్ట్ యాక్ట్ 1967, వైల్డ్ లైఫ్ యాక్ట్ 1972 కింద కేసు నమోదు చేసి జ్యుడీషియల్ ఫస్ట్ క్లాస్ మెజిస్ట్రేట్ నర్సాపూర్ కోర్టుకు రిమాండ్ నిమిత్తం పంపడం జరిగిందని ఎఫ్‌ఆర్‌వో అరవింద్ తెలిపారు. ఈ కేసులో బొంతపల్లికి చెందిన యాసిన్, కృష్ణ, శంకరయ్య, వీరస్వామి నత్నాయిపల్లికి చెందిన శ్రీకాంత్, విజయ్, భానుప్రసాద్, హత్నూరాకు చెందిన పోచయ్యను అదుపులోకి తీసుకున్నారు. దాడిల్లో సెక్షన్ ఆఫీసర్ సాయిరాం, బీట్ ఆఫీసర్ గోపాల్‌రెడ్డి, సిబ్బంది పాల్గొన్నారు.

### హామీల అమలులో కాంగ్రెస్ విఫలం: సీఐటీయూ

మెదక్ మున్సిపాలిటీ, మార్చి 15: రాష్ట్ర ప్రభుత్వం కార్మిక వర్గానికి ఇచ్చిన హామీలు అమలు చేయడంలో పూర్తిగా విఫలమైందని సీఐటీయూ రాష్ట్ర ఉపాధ్యక్షుడు మల్లికార్జున్ అన్నారు. శనివారం జిల్లా కేంద్రంలోని కేవల్ కిషన్ భవన్‌లో సీఐటీయూ జిల్లా ఆఫీస్ బేరర్స్ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎన్నికల సమయంలో అసంఘటిత కార్మికులు హమాలీ, ట్రాన్స్‌పోర్ట్, భవన నిర్మాణం, ఇతర కార్మిక రంగాలకు ఇచ్చిన హామీలు అమలుచేయలేక తుంగలో తొక్కారని మండిపడారు. ప్రభుత్వ హామీల పరిష్కారం కోసం ఈనెల 21న చలో హైదరాబాద్ ధర్నా నిర్వహిస్తున్నట్లు మల్లికార్జున్ వెల్లడించారు. ధర్నాకు జిల్లాలోని కార్మికులు అధిక సంఖ్యలో పాల్గొనాలని పిలుపునిచ్చారు. సమావేశంలో సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షుడు మల్లేశం, నర్సమ్మ, బాలమణి, నాగరాజు, నాగేందర్‌రెడ్డి, బాలమణి, సంతోష్ తదితరులు పాల్గొన్నారు.

## బాధిత కుటుంబానికి కంఠారెడ్డి పరామర్శ


నగేశ్‌ను పరామర్శిస్తున్న కంఠారెడ్డి తిరుపతిరెడ్డి

నిజాంపేట, మార్చి 15: నిజాంపేటకు చెందిన బీఆర్‌ఎస్ నాయకుడు నగేశ్ నానమ్మ పంపరి ఎంకవ్వ (80) అనారోగ్యంతో బాధపడుతూ ఇటీవల మృతి చెందింది. విషయం తెలుసుకున్న బీఆర్‌ఎస్ నాయకుడు కంఠారెడ్డి తిరుపతిరెడ్డి శనివారం నిజాంపేటకు చేరుకొని బాధిత కుటుంబసభ్యులను పరామర్శించారు.పరామర్శించిన వారిలో కల్వకుంట పీఏసీఎస్ చైర్మన్ అందె కొండల్ రెడ్డి,బీఆర్‌ఎస్ నాయకులు రవీందర్,రంజిత్‌గౌడ్ ఉన్నారు.

### అంత్యక్రియలకు కంఠారెడ్డి ఆర్థిక సాయం

రామాయంపేట రూరల్, మార్చి 15: మండలంలోని అక్కన్నపేట గ్రామానికి చెందిన రాగిన నరేశ్ అనారోగ్యంతో మృతి చెందాడు. విషయాన్ని గ్రామ బీఆర్‌ఎస్ నాయకులు మెదక్ నియోజకవర్గ ఇన్‌చార్జి కంఠారెడ్డి తిరుపతిరెడ్డికి తెలిపారు. ఆయన రూ.5 వేలు మృతుడి అంత్యక్రియలకు అందజేశారు. చట్టిమల్లి నరేందర్‌రెడ్డి, పాపయ్యగారి నర్సింలు, శ్రావణ్‌గౌడ్, పండు, నాగరాజు, గౌండ స్వామి, భూమ రమేశ్ అందజేశారు.

## బాధిత కుటుంబాలను పరామర్శించిన మాజీ ఎమ్మెల్యే


బాధిత కుటుంబాన్ని పరామర్శిస్తున్న పద్మాదేవేందర్‌రెడ్డి


చిన్నశంకరంపేట, మార్చి 15: బాధిత కుటుంబాలను మాజీ ఎమ్మెల్యే పద్మాదేవేందర్‌రెడ్డి శనివారం పరామర్శించారు. మండలంలోని కుమ్మరిపల్లి గ్రామానికి చెందిన బీజేపీ నాయకుడు నందారెడ్డి తండ్రి ఇటీవల మృతి చెందాడు. బాధిత కుటుంబాన్ని మాజీ ఎమ్మెల్యే పరామర్శించి, ఓదార్చారు. మండలంలోని ఎస్.కొండాపూర్ గ్రామానికి చెందిన అబ్బి నర్సింలు ఇటీవల మృతి చెందాడు. బాధిత కుటుంబాన్ని పరామర్శించారు. చందంపేట గ్రామానికి చెందిన ఓ పత్రికా విలేకరి సుధాకర్ తల్లి మృతి చెందింది. బాధిత కుటుంబాన్ని, ఇదే గ్రామానికి చెందిన గ్యాస్ ప్రమాదంలో గాయపడిన కుమ్మరి నరేశ్‌ను పరామర్శించారు. ఆమె వెంట బీఆర్‌ఎస్ మండల అధ్యక్షుడు రాజు, మాజీ సర్పంచ్‌లు యాదగిరి యాదవ్, శ్రీనివాస్‌రెడ్డి, లక్ష్మణ్,శ్రీలత, స్వామిదాస్,సత్యాగౌడ్,ఉపేందర్‌రెడ్డి ఉన్నారు.

# మాదిగలను మోసం చేస్తున్న రేవంత్‌రెడ్డి


మెదక్ రాందాస్ చౌరస్తాలో నిరాహార దీక్ష చేస్తున్న ఎమ్మార్పీఎస్ నాయకులు

మెదక్, మార్చి 15 (నమస్తే తెలంగాణ): అసెంబ్లీ సాక్షిగా మాదిగలకు ఇచ్చిన మాటను సీఎం రేవంత్‌రెడ్డి నిలబెట్టుకోవాలని ఎమ్మార్పీఎస్ నాయకుడు యాదగిరి మాదిగ డిమాండ్ చేశారు. మెదక్ జిల్లా కేంద్రంలోని రాందాస్ చౌరస్తాలో ఎమ్మార్పీఎస్ ఆధ్వర్యంలో నిరాహార దీక్ష శనివారం కూడా కొనసాగింది. ఎస్సీ వర్గీకరణకు సానుకూలం అంటూనే మరోపక్క వర్గీకరణ లేకుండా ఉద్యోగ నియామకాలను చేస్తున్నారన్నారు. ప్రస్తుత అసెంబ్లీ సమావేశాల్లో ఎస్సీ రిజర్వేషన్ల వర్గీకరణను ఏబీసీడీలుగా వర్గీకరణ చేసి జనాభా ప్రకారం బిల్లు పెట్టాలన్నారు. కార్యక్రమంలో జిల్లా కార్యనిర్వాహక అధ్యక్షుడు అస్త్రగల్ల బాలరాజు, జిల్లా అధికార ప్రతినిధి సుధాకర్, జిల్లా ఉపాధ్యక్షుడు ఏర్పుల పరమేశ్, మాసాయిపేట మండల అధ్యక్షుడు, కార్యదర్శులు ప్రభాకర్, భిక్షపతి, భాస్కర్, నాయకులు మొగిలి గుండ్ల శంకర్ మాదిగ, నాయకులు కొమ్ముశేకులు, దండోల సామేలు, మెదక్ పట్టణ నాయకులు ప్రభాకర్, దేవేందర్, ఎంఎస్‌ఎఫ్ జిల్లా అధ్యక్షుడు సంపత్ కుమార్, మహాజన సోషలిస్టు పార్టీ అధ్యక్షుడు మురళీమాదిగ తదితరులు పాల్గొన్నారు.

## బాధిత కుటుంబాలకు ఆర్థిక సాయం



శివ్వంపేట, మార్చి 15: పోతులబొగుడలో మృతి చెందిన నీరడి భిక్షపతి కుటుంబానికి మాజీ జడ్పీటీసీ పబ్బమహేశ్‌గుప్తా రూ.10 వేలు, పీఏసీఎస్ చైర్మన్ వెంకటరాంరెడ్డి రూ.5వేలు, పిల్లుట్లలో మృతి చెందిన ముంద్రాతి రామమ్మ కుటుంబానికి రూ.5వేల చొప్పున ఆర్థిక సాయం అందజేశారు.

## సీజనల్ వ్యాధులపై అప్రమత్తంగా ఉండాలి


చికిత్సలు చేస్తున్న వైద్యురాలు హరిప్రియ

రామాయంపేట, మార్చి 15: సీజనల్ వ్యాధులపై అప్రమత్తంగా ఉండాలని డి.ధర్మారం పీహెచ్‌సీ వైద్యురాలు హరిప్రియ పేర్కొన్నారు. వేసవిలో ఎక్కువ మందికి దగ్గు, జలుబు, కీళ్ల నొప్పులు, చిన్న పిల్లలకు ఉబ్బసం వ్యాధులు వస్తాయని ఆమె తెలిపారు.

### మద్యం తాగి వాహనాలు నడిపితే కఠిన చర్యలు

రామాయంపేట రూరల్, మార్చి 15: మద్యం తాగి వాహనాలు నడిపితే కఠిన చర్యలు ఉంటాయని ఏఎస్ఐ రవీందర్ అన్నారు. శనివారం మెదక్ వెళ్లే రోడ్డు వద్ద వాహనాలు తనిఖీ చేశారు. పెండింగ్ చలాన్లు చెల్లించని వారు వెంటనే చెల్లించాలని సూచించారు. వాహనాలకు సంబంధించిన పత్రాలు ఉంచుకోవాలన్నారు.

## విద్యార్థులకు పరీక్ష ప్యాడ్లు పంపిణీ

కౌడిపల్లి, మార్చి 15: మండలంలోని బాలికల ఉన్నత పాఠశాలలో శనివారం 46 మంది విద్యార్థినులకు పరీక్షా ప్యాడ్లు, సామగ్రిని మెదక్ జిల్లా ఆర్యవైశ్య సంఘం కార్యవర్గ సభ్యుడు, కౌడిపల్లి కౌడ శ్రీనివాస్ గుప్తా అందజేశారు. ఆయన మాట్లాడుతూ బాగా చదివి 10 జీపీ సాధించి పాఠశాలకు మంచి పేరు తీసుకురావాలన్నారు.

### నేడు ఉచిత వైద్య శిబిరం

వెల్దుర్తి, మార్చి 15: మాసాయిపేటలో నేడు ఉచిత వైద్య శిబిరాన్ని ఏర్పాటు చేస్తున్నట్లు మాజీ సర్పంచ్ మధుసూదన్‌రెడ్డి శనివారం ప్రకటనలో తెలిపారు. హైదరాబాద్‌కు చెందిన సీసీ శ్రాఫ్ మెమోరియల్ దవాఖాన వారు నందిని రమేశ్, గాంధీ పబ్లిక్ చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో ప్రభుత్వ పాఠశాలలో నిర్వహించనున్నారు.

### ఆర్థిక సాయం అందజేత



చిన్నశంకరంపేట, మార్చి15: మండల పరిధిలోని సూరారం గ్రామానికి చెందిన పంట సావిత్రి ఇటీవల మృతి చెందగా బాధిత కుటుంబానికి లీలాగ్రూప్ చైర్మన్ డాక్టర్ మోహన్‌నాయక్ శనివారం రూ.5వేల ఆర్థిక సాయాన్ని అందజేశారు.

## తాగునీటి కోసం ఖాళీ బిందెలతో నిరసన


గుండ్లపల్లిలో ఖాళీ బిందెలతో నిరసన తెలుపుతున్న ప్రజలు

శివ్వంపేట, మార్చి 15: మండలంలోని గుండ్లపల్లి గ్రామం ఎస్సీ కాలనీలో మిషన్ భగీరథ నీళ్లు రాక ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. శనివారం కాలనీ ప్రజలు, మహిళలు ఖాళీబిందెలు, డ్రమ్ములు పెట్టి ప్రభుత్వానికి, అధికారుల తీరుకు వ్యతిరేకంగా గ్రామంలో నిరసన తెలిపారు. ఈ సందర్భంగా కాలనీవాసులు మాట్లాడుతూ కాలనీకి వచ్చే మిషన్ భగీరథ పైపులైన్ చెడిపోయిందన్నారు. ఏడాదిగా తమకు నల్లా నీళ్లు రావడం లేదని, తాము నీటి కోసం పడరాని పాట్లు పడుతున్నామని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. పంచాయతీ కార్యదర్శి మూడు రోజులకోసారి ట్యాంకర్ ద్వారా నీటిని పంపుతున్నారన్నారు. నీరు సరిపోక పొలాల్లోని బోర్ల నుంచి నీళ్లు తెచ్చుకుంటున్నామని, తమ పంటలకే నీరు సరిపోవడం లేదని రైతులు నీళ్లివ్వడం లేదని తెలిపారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి నీటి సమస్యను పరిష్కరించాలన్నారు. లేనిపక్షంలో కలెక్టర్ కార్యాలయానికి ఖాళీబిందెలతో వెళ్లి ధర్నా చేస్తామని హెచ్చరించారు.

## సామాజిక తనిఖీ ప్రజావేదిక


మాట్లాడుతున్న జిల్లా గ్రామీణాభివృద్ధి అధికారి శ్రీనివాస్‌రావు

నర్సాపూర్, మార్చి 15: నర్సాపూర్‌లోని ఎంపీడీవో కార్యాలయ ప్రాంగణంలో శనివారం ఉపాధి హామీ పథకం 15వ విడత సామాజిక తనిఖీ ప్రజా వేదికను నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా గ్రామీణాభివృద్ధి అధికారి శ్రీనివాస్‌రావు మాట్లాడుతూ ఉపాధి హామీ పథకం 2023–24 ఆర్థిక సంవత్సరంలో రూ. 9,18,00,968 పెట్టిన ఖర్చుకు 15 రోజుల నుంచి సామాజిక తనిఖీ బృందం కూలీలను కలిసి విచారించి, గ్రామసభలు నిర్వహించనున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో స్టేట్ రిసోర్స్ పర్సన్ రవి, ఎంపీడీవో మధులత, హెచ్‌ఆర్ మేనేజర్ రాజేందర్‌రెడ్డి, జిల్లా విజిలెన్స్ ఆఫీసర్ సంపత్‌కుమార్, ఎంపీవో వైద్య శ్రీనివాస్, ఏపీవో అంజిరెడ్డి, ఈసి ముజీబ్ ఖురేషి తదితరులు పాల్గొన్నారు.

## దుర్గామాతను దర్శించుకున్న పాట్నా హైకోర్టు న్యాయమూర్తి



దుర్గామాతను దర్శించుకున్న పాట్నా హైకోర్టు న్యాయమూర్తి

పాపన్నపేట, మార్చి15: ఏడుపాయల వనదుర్గామాతను పాట్నా హైకోర్టు న్యాయమూర్తి అనుపమా చక్రవర్తి కుటుంబ సమేతంగా దర్శించుకున్నారు. శనివారం ఏడుపాయలకు చేరుకోగా అదనపు కలెక్టర్ నగేశ్, ఆర్డీవో రమాదేవి, ఆలయ ఈవో చంద్రశేఖర్ స్వాగతం పలికారు. అమ్మవారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు.

### అమ్మవారిని దర్శించుకున్న సీరియల్ ఆర్టిస్ట్


ఏడుపాయల వనదుర్గామాతను సీరియల్ ఆర్టిస్ట్ జ్యోతిరెడ్డి దర్శించుకున్నారు. ప్రత్యేక పూజలు చేసి తీర్థప్రసాదాలు అందజేశారు.

## డంపింగ్‌యార్డు నిర్ణయాన్ని వెనక్కి తీసుకోండి


దీక్షలో కూర్చున్న ప్రజలు

నర్సాపూర్, మార్చి 15: ప్రభుత్వం తలపెట్టిన డంపింగ్ యార్డు నిర్ణయాన్ని తక్షణమే వెనక్కి తీసుకోవాలని బీఆర్‌ఎస్ పట్టణ అధ్యక్షుడు పంబల భిక్షపతి డిమాండ్ చేశారు. సంగారెడ్డి జిల్లా గుమ్మడిదల మండలం ప్యారానగర్‌లో ప్రభుత్వం ఏర్పాటు చేస్తున్న డంపింగ్‌యార్డు నిర్మాణానికి వ్యతిరేకంగా నర్సాపూర్‌లో జరుగుతున్న రిలేనిరాహారదీక్ష శనివారం నాటికి 26వ రోజుకు చేరుకుంది. శనివారం బీఆర్‌ఎస్ పట్టణ అధ్యక్షుడు భిక్షపతి ఆధ్వర్యంలో 15వ వార్డు ప్రజ లు రిలేనిరాహారదీక్షలో కూర్చున్నారు. బీజేపీ జిల్లా అధ్యక్షుడు మల్లేశ్‌గౌడ్, రైతు రక్షణ సమితి జిల్లా గౌరవధ్యక్షుడు మైసయ్య యాదవ్ సంఘీభావం తెలిపారు. కార్యక్రమంలో 15వ వార్డు ప్రజలు, రైతు రక్షణ సమితి సలహాదారుడు చంద్రశేఖర్ పాల్గొన్నారు.

## రేపటి నుంచి తునికి నల్ల పోచమ్మ జాతర


కొలువుదీరిన నల్ల పోచమ్మ తల్లి

కౌడిపల్లి, మార్చి 15: కొలిచిన వారికి కొంగు బంగారమై వెలుగొందుతుతున్న తునికీ నల్ల పోచమ్మ జాతర జిల్లాలోనే రెండో అతి పెద్దదిగా పేరుగాంచింది. ఈ ఆలయానికి జిల్లాతో పాటు పలు జిల్లాలు, హైదరాబాద్ నుంచి అధిక సంఖ్యలో భక్తులు వస్తారు. ఈ జాతర 17 నుంచి 20వ తేదీ వరకు జరుగనున్నది.

## అటవీ చట్టాలను అతిక్రమిస్తే కఠిన చర్యలు

రామాయంపేట రూరల్, మార్చి 15: అటవీ చట్టాలను అతిక్రమిస్తే కఠిన చర్యలు ఉంటాయని రామాయంపేట అటవీ శాఖ రేంజర్ విద్యాసాగర్ అన్నారు. శనివారం తన కార్యాలయంలో మాట్లాడుతూ రేంజ్ పరిధిలో అటవీ ప్రాంతం నుంచి అక్రమంగా ఇసుక, కలప, రాళ్లు రవాణా చేస్తే ఉపేక్షించబోమన్నారు. వన్య ప్రాణులు అడవిలో నుంచి రోడ్డు మీదకు వచ్చినా, చిరుత ఆనవాళ్లు కనిపించినా సమాచారం ఇవ్వాలన్నారు. అటవీ ప్రాంతాల్లో అగ్ని ప్రమాదాలు జరిగితే సమాచారం ఇవ్వాలన్నారు.

## ఓటరు జాబితా నమోదుపై సమావేశం

మెదక్, మార్చి 15 (నమస్తే తెలంగాణ): కలెక్టర్ ఆదేశాల మేరకు మెదక్ ఆర్డీవో కార్యాలయంలో అన్ని రాజకీయ పార్టీల ప్రతినిధులతో ఆర్డీవో రమాదేవి సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సమావేశంలో ఫారం–6, 7,8 ల గురించి అవగాహన కల్పించారు. ఓటరు జాబితా నిరంతర నమోదు, బూత్ స్థాయి ప్రతినిధుల నియామకం గురించి చర్చించినట్లు తెలిపారు. పలువురు రాజకీయ పార్టీల ప్రతినిధులు లేవనెత్తిన సందేహాలకు సమాధానం ఇచ్చారు. సమావేశంలో తహసీల్దార్ లక్ష్మణ్‌బాబు, తదితరులు పాల్గొన్నారు.

## విజయ పాలకేంద్రం వద్ద నిరసన

పెద్దశంకరంపేట, మార్చి 15: గ్రామీణ ప్రాంతాల్లోని ఏజెంట్లకు పెండింగ్ బిల్లులు వెంటనే చెల్లించాలని డిమాండ్ చేస్తూ పెద్దశంకరంపేట విజయ పాలకేంద్రం వద్ద శనివారం ఏజెంట్లు నిరసన వ్యక్తం చేశారు. ఏజెంట్లు మాట్లాడుతూ ఇతర మండలాల్లో విజయ ఏజెంట్లకు పెండింగ్ బిల్లులు చెల్లించాలని, పెద్దశంకరంపేటలో బిల్లులు చెల్లించకపోవడంతో తాము ఇబ్బందులు పడుతున్నామని ఆవేదన వ్యక్తం చేశారు.